# ఆదర్శాల అడుగున

ఆ పూట ఎంత ప్రయత్నించినా ముకుందానికి నిద్ర రావడం లేదు. మనస్సంతా మబ్బు కమ్మినట్టుగా, మసక మసగ్గా, గుబులు గుబులుగా ఉంది. ఇది మరిచి పోయేందుకే అతనికి నిద్ర రావాలనుకొంటున్నాడు. కానీ రాదు. కావాలనుకొన్న నిద్ర రాకపోవడానికీ, వద్దనుకొంటున్న జ్ఞాపకాలు పదేపదే మేలుకొని అల్లరి పెట్టటానికీ ఏదో సంబంధం ఉండాలనుకొన్నాడు ముకుందం. కానీ, ఆ సంబంధ మేదో అతనికి తెలియ లేదు.

చెరిపివేసిన కొందికీ, గత స్మృతులు మనోదర్పణంలో స్పష్టంగా కనపడసాగాయి. ఆ దృశ్యాలను చూసి ఒక్క నిట్టూర్పు విడిచాడు ముకుందం.

ఓ దృశ్యంలో తన తండ్రి ఖద్దరు అమ్మటం కనిపించింది. అప్పుడే బిలబిల లాడుతూ పోలీసులు తన తండ్రిని చుట్టుముట్టారు. తండ్రి పెద్దగా అరుస్తూ ఖాదీ అమ్ముతున్నాడు. కాస్సేపటికి పోలీసుల లాఠీలు గాలిని రివ్వున కోసుకొంటూ వచ్చి, తండ్రి శరీరంమీద వాలాయి. పావుగంట గందరగోళం తరువాత పోలీసులు వెళ్ళిపోయారు. తండ్రిగారు రోడ్డుమీద పడివున్నాడు. ఆయన భుజాన ఖాదీ తానులు లేవు. రక్తపు మరకలు మాత్రమే ఉన్నాయి. దోవన పోతున్న ఓ ధర్మాత్ముడు ఆయన్ని పక్కకు చేర్చాడు...

మరో దృశ్యంలో తండ్రి హరిజనవాడలో ప్రచారం చేస్తూ కనిపించాడు. ఆయన వెంట పాతికమంది యువకు లున్నారు. అందరూ పాడుకొంటూ హరిజనవాడలో తిరిగారు. వారితో కలసి భోజనాలు చేశారు. ఆ నాటినుండీ తమ ఇంటికి బంధువులు రావడం మానేశారు...

ఇంకో దృశ్యంలో కల్లు అంగడి దగ్గర నాన్న బోర్లా పడుకొని ఉన్నాడు. కొంతమంది ఆయన చుట్టూ కూచుని 'రఘుపతి రాఘువ' పాడుతున్నారు. అంతలో పోలీసులు వచ్చారు. నాన్నను, మిగతా పదిమందినీ, పశువుల్ని బాది నట్లు బాది, అవతలకు లాగేశారు. తలలు పలిగినవాళ్ళు, చేతులు విరిగినవాళ్లు, 'జై' ననే వాళ్ళు, 'లే'దనే వాళ్లూ ఆ ప్రాంతమంతా గొడవతో నిండిపోయింది.

ఇటువంటివి, ఒకటి కాదు – రెండు కాదు వంద లున్నాయి. కొన్నింటిలో తనూ ఉన్నాడు. ఇంకొన్ని అమ్మ చెప్పగా విన్నాడు. అనేకసార్లు తన కనిపించేది. ఇన్ని ఇబ్బం దులు పడటమెందుకా అని? ఇవన్నీ చెయ్యకపోయినా తన తండ్రి కొచ్చిన లోటు లేదు. రెండు చేతులా ఆర్జించడానికి వీలున్న ఉద్యోగం వదులుకున్నాడు. పైగా ఉన్న ఆస్తంతా ఖర్చుపెట్టేశాడు. చివరి రోజుల్లో డబ్బుకు నానా అవస్థా పడ వలసి వచ్చింది. అయినా అమ్మగానీ, నాన్నగానీ, చేసిన పనికి విచారించిన జ్ఞాపకం లేదు. పొరబాటుననైనా, వాళ్ళు పశ్చాత్తాపపడిన రుజువు లేదు. సంతోషించేవారు పైగా.

అంటే – జీవితమంతా గర్వించ దగిన ఆదర్శ మేదో వారు నిర్వర్తించి ఉండాలి. ఆ ఆదర్శం సరైనదా కాదా అన్నది సమస్యే మరి! కానీ, దాన్ని ఎంత మనస్ఫూర్తిగా

వహించవలసిన వ్యక్తి దగ్గరికెళ్ళి, ప్రత్యేకంగా నాక్కావలసిందేమిటో చేసిపెట్టమని అడగటమంటే, అంతకన్నా నీచాన్ని నేను ఊహించలేను. ఇంకెవరన్నా చేస్తే చెయ్యనివ్వు. కానీ, నేను మాత్రం చెయ్యను. అది నా ఆదర్శానికే సరిపడదు. నువ్వు బాగుపడటం సుఖపడటం ఇష్టం లేదని నేను కోరుకుంటున్నానో, లేదో నాకూ, ఆ భగవంతునికీ తెలుసు. ఇంతకన్నా నేను చెప్పగలిగిందేమీ లేదు' అన్నాడు నాన్న.

ఆ పూటే అక్కయ్యా బావా వెళ్ళిపోయ్యారు. మళ్ళెప్పుడూ రానూ లేదు. నాన్న వెళ్ళినప్పుడు, కూడా వసంతా, అక్కయ్యా వచ్చారు గానీ, బావ మాత్రం రాలేదు.

వెళ్ళిపోయిన పదిరోజులదాకా, నాన్న చాలా చిరాగ్గా ఉండేవాడు. ఎప్పుడూ ఏదో దిగులుగా బరువుగా కనిపించేవాడు. పదోనాడు అక్కయ్య ఉత్తరం రాసింది. బావకు ఆ పని దొరికిందట. ఇంకెవరో సాయం చేశారట. ఆ విషయం రాస్తూ చివర్న ఇంకో వాక్యం కూడా రాసింది. 'ఆదర్శాలు ఎంతమంచివైనా, అవి కాలాన్ని, పరిసరాలనూ కలుపుకొంటూ పోవాలి. అందుకు భిన్నంగా ఉండేవేవీ ఈ ప్రపంచంలో ఉండటానికి అవకాశం లేదు. మీరూ మీ ఆదర్శాలూ సురక్షితంగా ఉండండి. సెలవు' అంటూ ముగించింది ఉత్తరాన్ని.

ఆ ఉత్తరం చూసి తను చాలా విచారించాడు. గానీ, నాన్న మాత్రం నవ్వుకొన్నాడు. నవ్వవలసింది ఏంకనిపించిందో ఆయనకు! తన కళ్ళముందు పుట్టినవారు తనకు పాఠాలు చెబుతున్నారన్న ఆలోచనో లేక, అక్కయ్య ఉత్తరంలో అడుగడుగునా కనిపిస్తున్న కసో — ఏదో తనకు తెలీదు.

ఆనాడు పడిన గండి తిరిగి పూడనేలేదు. రాను రాను అది మరింతగా పెరిగిపోయింది. చూపులు కూడా మందగించాయి. ఎప్పుడన్నా అమ్మే వెళ్ళి చూసివస్తూ ఉండేది. తిరిగివచ్చి నప్పుడల్లా, వెళ్ళినందుకు ఎంతో విచారించేది. అప్పటి కోపాన్ని బావ ఇంకా మర్చిపోలేదంటూ చెప్పుకొచ్చేది. అమ్మతో సరిగ్గా పలకను కూడా పలుకలేదట. అక్కయ్యకు లోలోపల ఎంత ఆపేక్షలున్నా బావకు భయపడి అదో మాదిరిగా ఉండేదట!

'అయితే ఇక వెళ్ళకమ్మా!' అనేవాడు తను.

అప్పటికి సరేనన్నప్పటికీ, మరో ఆరునెల్లకో, ఏడాదికో, అమ్మ ప్రయాణం కట్టేది. 'ఏమిటమ్మా ఇదంటే, 'కన్న కడుపు నాయనా' అనేది. అక్కడ అవమానం తప్పదని తెలిసీ అమ్మ వెడతా నంటున్నదంటే, ఆమె ఆపేక్షను ఎలా కాదనడం?

అమ్మ పోయిన తర్వాత ఆ చూపులూ ఆఖరయ్యాయి. ఉన్న పొలం కవులుకిచ్చేసి తనూ సిటీలో చదువు వెలగపెడుతున్నాడు. చాలీచాలనీ ఆదాయం కావడంవల్ల ప్రైవేట్లు చెప్పవలసి వచ్చింది! అయినా గిజగిజ తప్పడంలేదు. అనేకసార్లు అక్కయ్యను కలుసుకొందామని వూగులాడాడు. వాళ్లు కూడా ఇక్కడే ఉంటున్నారు. వెడితే ఏదో సాయం చేయకపోదు. కానీ సహాయం పొందడానికే తను వచ్చినట్టు అక్కయ్య అనుకొంటుందేమోనని తన భయం! అంతకన్నా బలంగా, మరేదో అభిమానం తనను పోకుండా అడ్డుకొడుతూ ఉంది. ఈ రోజున వారి స్థితికీ తనకూ ఎక్కడా పోలికలే లేవు, డబ్బు, అధికారం, హోదా, తమ ఇద్దరి మధ్యా బ్రహ్మాండ

కైన అగడ్తలను నిర్మించాయి. ఇవి తను దాటనూ లేదు. దాటి రావలసిన అగత్యం వారికి లేనూ లేదు.

—అసలీ సంగతులన్నీ తన కెందుకీ పూట జ్ఞాపక మొస్తున్నట్టు?—అవును! ఇందాక తనకో కొత్త ట్యూషను దొరికింది. ఆ ఇల్లాలిని చూడగానే అక్కయ్య జ్ఞప్తికొచ్చింది. ఆ జ్ఞాపకాన్ని ఆధారం చేసుకొని, మిగతా స్మృతులన్నీ నిద్ర లేచాయి.

ముకుందం బద్ధకంగా ఆవలించి చిటిక వేశాడు. గడియారంకేసి విసుగ్గా చూశాడు. పన్నెండు గంటలకింకా పది నిముషాలు తక్కువగా ఉంది. లైటు ఆర్పేసి, దుప్పటి మెడదాకా లాక్కున్నాడు. కళ్ళు మూసుకొన్నాడు. మళ్ళా అక్కయ్య బొమ్మ కనిపించింది. ఆలోచనలు అక్కయ్య చుట్టూ తిరుగుతున్నాయి.

హఠాత్తుగా ముకుందం శరీరం జలదరించి నట్లయింది. మెట్లమీదుగా ఎవరో వస్తున్న చప్పుడు వినపడుతోంది. ఇంత రాత్రివేళ తన గది కొచ్చే దెవరో అతను వూహించలేక పోయాడు. ఇంతలోనే తలుపు తడుతున్నట్టు వినిపించింది. ముకుందం మరింత ఆశ్చర్యపోయాడు. ఋజువుకోసం చెవులు నిక్కించి విన్నాడు. ఈసారి మరింత పెద్దగా తలుపు చట్టిన చప్పుడు వినవచ్చింది. మెల్లిగా లేచి లైటు వేశాడు. మూసి ఉన్న తలుపులకేసి ప్రశ్నార్థకంగా చూశాడు.

'ఎవరది?' అన్నాడు ముకుందం.

జవాబుగా అతనికి తలుపు చప్పుడు మాత్రమే వినిపించింది.

ముకుందానికి ఏమీ పాలుపోలేదు. ఏదో భయం కూడా లీలగా పొడకట్టింది. మెల్లగా గడియతీశాడు. తలనిండా ముసుగు కప్పుకున్న ఆకారం చప్పున లోపలికొచ్చి, తలుపులు మూసేసింది. ముకుందం నిర్విణ్ణుడయ్యాడు.

తన పాదాలమీద తలపెట్టి భోరుమని విలపిస్తున్నది వసంతేనని నమ్మడానికి ముకుందానికి చాలాసేపు పట్టింది. ఇటువంటి సంఘటనను ఎదుర్కోవడానికి సిద్ధంగా లేకపోవడం వల్ల అతను దిమ్మెరపోయ్యాడు. కొన్ని క్షణాలపాటు ఇదంతా స్వప్నమేమోనని కూడా ముకుందం అనుకున్నాడు. అతని బుద్ధి మొద్దుబారిపోయింది. యాంత్రికంగా వెనక్కు జరిగి, తనూ కూచున్నాడు. వసంత చేతులు, తిరిగి అతని పాదాలను స్పృశించాయి.

'ఏమిటమ్మా ఇదంతా ?' అన్నాడు ముకుందం.

ఈ మాట వినడంతో వసంత విచారానికి కట్టలు తెగిపోయాయి. ఆమె ఆగుబ్బుగా ఏడ్వసాగింది. ముకుందం ఓదార్పు, ఆ విచారాగ్నికి ఇంధనంలా తోడ్పడింది. ఎన్నిసార్లడిగినా కారణం మాత్రం చెప్పడంలేదు.

'నన్ను రక్షిస్తానని ముందుగా మాటివ్వాలి బావా! లేకపోతే నీ పాదాలు వదిలిపెట్టను' అన్నది వసంత ఏడుస్తూనే.

ముకుందం కొన్నినిముషాలపాటు వసంతకేసి చూశాడు. మిన్నాగులా నేలమీద కదులుతూ, గుండెలవిసేలా ఏడుస్తున్న వసంత అతని కెంతో జాలి కలిగించింది. వసంతతోబాటు అక్కయ్య, బావ, వారి అంతస్థు, అన్నీ స్ఫురణకొచ్చాయి. ఈ రెండు కుటుంబాల మధ్య గల అగత్తను పూడ్చేందుకు

ఏనాడో మరుగుపడిన అనురాగం పొటమరించింది. అప్రయత్నంగా అతని కళ్లూ నీటితో నిండాయి.

'అందరూ కులాసాగా ఉన్నారా వసంతా?' అన్నాడు, ఏం వినవలసి వస్తుందోనని భయపడుతూ.

'ఆఁ'.

నిట్టూర్పు విడిచాడు ముకుందం.

'నేను చెయ్యగలిగిందైతే తప్పకుండా చేస్తాను' అన్నాడు ముకుందం.

మరోసారి గట్టిగా ఏడ్చి శాంతించింది వసంత. ఆమె జుట్టు చిరాగ్గా ఉంది. కళ్ళు ఎర్రగా వాచిపోయాయి. పెదవులు ఎండిపోయి ఒణుకుతున్నాయి. కళ్ళకాటుక, నీటితో కలిసి వికృతంగా పక్కకు జరిగింది. ఇందాక, ఎంతో ఆప్యాయంగా వెన్ను నిమిరిన ముకుందం, ఇప్పుడామెను తాకలేకపోయాడు.

'ముందా కూజాలో నీళ్ళున్నాయి. ముఖం కడుక్కో. అదో టవలు. సబ్బుకూడా ప్రక్కనే ఉంది. ఊఁ — లే!.' అన్నాడు ముకుందం!

'ఇప్పుడివన్నీ ఎందుకులే బావా!' అన్నది వసంత విరక్తిగా.

'ఈ గదిలో ఉన్నంతసేపయినా నా మాట వింటావనుకొంటున్నాను!'

వసంత నిశ్శబ్దంగా లేచింది.

ముకుందం మేనకోడలికేసి కళ్ళార్పకుండా చూస్తున్నాడు. ఇంత దగ్గరగా చూసి దాదాపు మూడేళ్ళు కావస్తున్నది. అప్పుడింత నేవళంగా లేదు. ఇంత పొడుగు లేదు.

అతని దృష్టిలో ఇంకా ఆనాటి వసంతరూపమే మెదులుతూ ఉంది. ఆ బొమ్మతో ఇప్పటి రూపాన్ని పోల్చుకొన్నాడు. ఉన్న భేదానికి ఆశ్చర్యపోయాడు.

వసంత తుండుతో ముఖం తుడుచుకుంటూ వచ్చింది.

'ఆ చేత్తోనే, ఆ ఫ్లాస్కులో ఉన్న కాఫీ కాస్త నాకిచ్చి, మిగతాది —' అన్నాడు ముకుందం.

'నా మనస్సేమీ బాగోలేదు బావా!' అన్నది వసంత.

'శరీరానికేం! అది బాగున్నంత కాలం, దానికావలసిందేదో అది ఇవ్వక తప్పేదేమున్నదమ్మాయ్! ముందా పనిచూస్తే తరవాత —'

వసంత ఆతని ఆదేశాన్ని అక్షరాలా పాటించింది.

తలుపువేపొకసారి చూసి, వసంతను చూశాడు ముకుందం. ఆమె కళ్ళల్లో తిరిగి నీళ్ళు కనిపించాయి. చూస్తుండగానే అవి ధారలు కట్టి చెక్కిళ్ళ మీదుగా జారసాగాయి.

'ఏం జరిగింది వసంతా!' అన్నాడు ముకుందం ఏదైనా సరే వినడానికి సిద్ధపడుతూ.

వసంత రెండు చేతుల్లోనూ ముఖాన్ని దాచుకొని, చాపచుట్టగా మంచం మీదికి వాలిపోయింది.

* * * *

ఆరోజు చాలా సుదినమనుకుంది వసంత. ఇంత కాలం తనలో అస్పష్టంగా ఉన్న ఆలోచనలకు మూర్తి సరైన రూపమిచ్చాడనుకొన్నది. అతనితో మాట్లాడుతుంటే ప్రాణానికి చాలా హాయిగా ఉన్నట్లనిపించింది. ఏదో ఆనందం కూడా కలుగుతూ ఉండేది. పదేపదే అతన్ని చూడాలనీ అతనితో మాట్లాడాలనీ వసంత చాలా తాపత్రయం పడింది.

ఇవన్నీ ప్రేమకు లక్షణాలే అయితే, వసంత తను మూర్తిని ప్రేమిస్తున్నాననే అనుకోవాలి. ఈ ప్రేమకు ఓ ఆదర్శమంటూ ఉంది. ఓ జీవిత ధ్యేయమంటూ ఉంది. తామిద్దరూ పెళ్ళాడటమంటూ జరిగితే — జరక్కపోవడమంటూ లేనే లేదు — ఈ దాంపత్యం చాలా ఆదర్శవంతమైన దాంపత్యంగా ఉండి తీరుతుందనీ వసంత రూఢిగా నమ్మింది. ఇలా నమ్మ డానికి వసంత దగ్గర బోలెడన్ని కారణాలున్నాయి. ఒకటి మూర్తి తనకు నచ్చాడు. తనూ, అతనికి నచ్చింది. రెండోది ఇంచుమించు ఇద్దరి ఆశయాలూ ఒక్కలాగే ఉన్నాయి. అనాదికాలంనుండీ ఆడవారు బానిసలుగా పడి ఉంటున్నారనే విషయంలోనూ, మగవారు స్వార్థంకొద్దీ వారిని అణగద్రొక్కి వేశారనే విషయంలోనూ, వారి ఉద్ధరణకోసం తీవ్రమైన కృషి చెయ్యాలన్న విషయంలోనూ, మూర్తికీ తనకూ భేదంలేదు. ఉన్నదల్లా 'ఎట్లా కృషి చెయ్యాలి?' అన్న దగ్గిరే వస్తోంది. వసంతేమో, పునాదుల దగ్గర్నించీ, మార్పులు రావాలంటుంది. మూర్తి గోడల దగ్గిర్నుంచీ మార్పులు తెస్తే చాలునంటాడు. ఆస్థిలో భాగస్వామ్యం, చదువు, ఉద్యోగం, మొదలైన వాంశాల్లో స్త్రీలకు ఎక్కువ ప్రాధాన్య ఉండాలని వసంత అభిప్రాయం. మూర్తి దీనికి అంగీకరించేవాడు కాడు.

'ఓ వేపున సమానత్వం కావాలంటూనే మరో వేంప ఆడవారికి ఎక్కువ ప్రాధాన్యం ఉండాలనడం న్యాయం కాదు. ఇదివరకు మగవారు చేసిన పనిని గర్హిస్తున్న మనం, ఇప్పు డదే పని స్త్రీలు చెయ్యాలనడంలో సబబులేదు. కాబట్టి ఇద్దరికీ సమానావకాశాలు ఉండటమే ధర్మం!' అనేవాడు.

ఈ పంపిణీమీద వారు రోజులకు రోజులు చర్చించు కొన్న సందర్భా లున్నాయి. ఈ చర్చలు చాలా దాకా పోయాయి. మూర్తి అనేక సార్లు వసంతతో సినిమా కెళ్ళాడు. వసంత కూడా గంటలకు గంటలు మూర్తి గదిలో విశ్రాంతంగా గడిపింది. ఆ కాలమంతా వసంతకు స్వర్గమయమనిపించింది. భగవంతుడు తమకోసమే ఇంత ఆనందాన్ని సృష్టించాడేమోననిపించేది. అలిసి నిద్రపోతున్న మూర్తిని చూస్తుంటే వసంతకు ఎంతో ముచ్చటేసేది. తన చుట్టూ బలంగా పెనవేసుకొనే చేతులు, తన చెక్కిళ్ళకోసం ఆత్రంగా వెదుక్కునే అతని పెదవులు, తనను మింగుతున్నట్టుగా చూసే అతనికళ్ళు — అపురూప వస్తువులుగా వసంతకు స్ఫురించేవి. లోకం కళ్ళు కప్పి ఆనందాన్ని జుబ్బన జూరలుగా జుర్రింది వసంత. కానీ ఆమె ప్రకృతి కళ్ళను కప్పలేక పోయింది. ఆనందం అనుభవించడం మాత్రమే మీ హక్కు కాదనీ, దాని ఫలితాన్ని కూడా అనుభవించమని ఆదేశించింది. ఈ ఆదేశాన్ని పాలించడానికి వసంత కెలాంటి అభ్యంతరమూ లేదు. అభ్యంతరం పెట్టిందల్లా మూర్తిగారు.

'ఇప్పుడేం చేదాం?' అన్నది వసంత.

'డాక్టర్ని కన్సల్టు చేదాం!' అన్నాడు మూర్తి నిశ్చింతగా,

డాక్టరు సమయం దాటిపోయిందన్నాడు. అయినా ఈ పాపిష్టి పని తనవల్ల కాదన్నాడు. మరో డాక్టరెవరన్నా చేస్తానన్నా నమ్మవద్దని సలహా యిచ్చాడు. ఇక మిగిలిందల్లా రెండే రెండు దారులు.

ఇద్దరూ పెళ్ళిచేసుకొని ఆదర్శ దాంపత్యం సాగించడం. లేదా వసంత —

'మా నాన్నగారితో చెబుతాను. వచ్చే నెల మన పెళ్ళికి ఏర్పాటు చేయించనా?' అన్నది వసంత.

మూర్తి మవునంగా ఉండిపోయాడు.

'పలకవేం మూర్తీ?' అన్నది వసంత. ఏదో అనుమానిస్తూ.

'నీకూ నాకూ మధ్య చాలా అంతరాలున్నాయి. వీటి నిలాగే ఉంచి మనం పెళ్ళాడినా సుఖపడబోయేది లేదు. ముందు వాటిని సరిచేసుకొన్నాక గానీ, నేను మాటివ్వను' అన్నాడు మూర్తి.

'అంటే?' అన్నది వసంత నిజంగానే అర్థంగాక.

'మీ నాన్న లకారాలు వెనక ఉన్నవాడు. నా స్థితి అలాంటిది కాదు. నేను నిన్ను పెళ్ళాడితే అనుక్షణం నా బీదతనం నన్ను వెక్కిరిస్తూనే ఉంటుంది,' అన్నాడు మూర్తి.

'నన్ను కాదని ఆస్థి ఎక్కడికీ పోదే!'

'అయినప్పుడు ముందుగానే కొంత నాపేర రాయడానికి అభ్యంతరం ఉండకూడదు మరి. ఆ పనేదో నువ్వు పూర్తి చేసిననాడు నా అంగీకారం ఉన్నట్టేననుకో!' అన్నాడు మూర్తి.

వసంతకు దుఃఖము పుక్కిలింతలయింది.

'నన్నామాత్రం నమ్మలేవా మూర్తీ?' అన్నది వసంత అలసి పోయినదానిలాగా.

'నేననగా లనుకొంటున్నదీ అదే! నేనయినా మొత్తం కావాలనడం లేదే! సగం చాలు. ఈ మాత్రం నన్ను నువ్వు విశ్వసించలేనప్పుడు మనం పెళ్ళాడి కూడా సుఖపడలే మనుకొంటాను. ప్రతిక్షణం ఒకరి కొకరం మోసగించు కుంటూ బ్రతకాలి. అంతకన్నా విడివడటమే మంచిది కాదా?' అన్నాడు మూర్తి. ఆమెపట్ల ఏమాత్రం సానుభూతి లేని వాడికి మల్లే.

"అయితే మనిద్దరి సంబంధానికీ గీటురాయి ఒక డబ్బేనా?" అన్నది వసంత.

'కాకపోవచ్చు గానీ, డబ్బుపాత్ర కూడా ఉంది. ప్రపంచంలో ఉన్న ప్రతి ఇద్దరి మధ్యగల సంబంధాన్ని డబ్బు నిర్ణయిస్తుందని ఎక్కడో చదివిన గుర్తు. అదెంతో నిజమని గూడా నా నమ్మకం! అయినపుడు మనిద్దరం అందుకు అతీతులం కాదుగా!......నువ్వేదో జరిగిందాని సంగతేమి టంటున్నావు? అందుకు మనిద్దరమూ బాధ్యులమే! కానీ నీ ధోరణి అలా లేదు. తప్పంతా నాదే నంటున్నావు. ఇప్పుడు నువ్వున్న స్థితిలో కాదని చెప్పినా నమ్మేటట్టు లేవు. తప్పు చెయ్యడమే జరిగితే నా వంతుకు నేను పశ్చాత్తాప పడు తున్నాను' అన్నాడు మూర్తి.

వసంత ఏమీ పలకలేక పోయింది. అప్పటికే ఆమె చుట్టూ గాఢతమస్సులు ఆవరించాయి. ఆ చీకట్లో దోవ తెలీక అల్లాడి పోయింది వసంత.

* * *

ముకుందం గాఢంగా నిట్టూర్పు విడిచాడు. అతని కళ్ళు చంద్ర నిప్పుల్లా ఎర్ర వారాయి. ఎండిపోయిన పెదవులను

నీరసంగా నాలుకతో తడుపుకొన్నాడు. దిగజారిపోతున్న చెమటలను తుడుచుకొన్నాడు. వసంత కేసి చూశాడు. గోడ వేపుగా తిరిగి కాళ్ళమధ్య తల నిరికించుకొని బొమ్మలా కూచుంది. మధ్య మధ్య వెక్కెక్కి పడుతూ, గాలికి ఎగ బీలుస్తూ ఉంది. చేతులు కదిలినప్పుడల్లా గాజులు గళ గళ మంటున్నాయి.

అక్కయ్యకూ, బావకూ ఈ గొడవ లేమీ తెలియవా వసంతా?' అన్నాడు ముకుందం.

లేదన్నట్టు వసంత మెల్లగా తలాడించింది.

ముకుందం తలొంచుకున్నాడు. చేతులు ముందుకు చాపి కళ్ళు మూసుకున్నాడు. అక్కయ్య, బావ, నాన్న, అమ్మ — పాత సంగతులన్నీ ఉవ్వెత్తుగా తలపుకొచ్చాయి: అవమాన పడవలసి వస్తుందని తెలిసికూడా అక్కను చూడ డానికెళ్ళే అమ్మ బొమ్మ కనిపించింది. 'కడుపుతీపి నాయనా!' అన్న మాటలు పదే పదే ధ్వనించాయి. ఇవే మాటలు అక్కకూ వర్తిస్తాయి, ఒక్కగా నొక్క కూతురు. ఈ ఒక్కటీ తనది కాకుండా పోయిననాడు అక్క పడే యమ యాతన, కడుపుకోత తను ఊహించగలడు. డబ్బు అంత స్థులను మారుస్తుందేమోగాని అంతరంగాలను, ఆపేక్షలనూ అంతగా మారుస్తుందని తనుఅనుకోలేదు. ఎంత చెడ్డ సంతాన మైనా నశించాలని తల్లి కోరుకోదు. మాతృహృదయమే అటు వంటిది, దానికి లోకంతో పనిలేదు. అవమానం, అగౌర వాలతో పనిలేదు. తన బిడ్డలు సుఖంగా ఉంటే అంతేచాలు!

అక్కయ్య జీవితం సుఖంగా ఉండటం, ఉండకపోవటం— ఇప్పటి తన నిర్ణయంమీదనే ఆధారపడి ఉంటుంది. తనేం చెయ్యాలి?

ముకుందం అరచేతులు గట్టిగా రుద్దుకొని కళ్ళు తుడుచుకున్నాడు. పెరగని గడ్డాన్ని తడుముకొన్నాడు. అతనికి జ్వరం తగిలినట్లుగా ఉంది. కణతలు లోపలికి నొక్కుకుపోతున్నట్లుగా ఉంది. ఏమీ మాట్లాడకుండా గదిలో పిల్లిలా అటూ ఇటూ తిరిగాడు. కిటికీలు వేశాడు. గోడనున్న తాళం చేతికందుకొన్నాడు.

'పోదాం పద!' అన్నాడు ముకుందం.

వసంత తలెత్తి చూసింది.

మరుక్షణంలో దీపం ఆర్పేశాడు ముకుందం.

* * * *

బావగారు ఎవరితోనో చెబుతున్నారు—

'భాయీ! నేనేమనుకొన్నానో అది చేశాను. నే నేనాడూ డబ్బును నిర్లక్ష్యం చెయ్యలేదు. అదంటే నాకు వల్లమాలిన ఆపేక్ష. అందుకోసం తుచ్ఛమైన పనులంటే చెయ్యలేదుగానీ, వచ్చే అన్ని మార్గాలా దాన్ని రాబట్టాను. కానీ, అదొక్కటే నా ఆదర్శం కాదు. డబ్బును మించిన ఆదర్శాలు నాకెన్నో ఉన్నాయి. నా చేతుల మీదుగా వందల మందికి చదువులు చెప్పించాను. బోలెడు ఉద్యోగాలు ఇచ్చాను. ఈ తరం మనుషుల మీద నాకు వల్లమాలిన విశ్వాసం ఉంది. తగినంత అవకాశం ఇస్తే ఈ తరంవాళ్ళు చెయ్యలేనిదంటూ లేదని నానమ్మకం... నాకు చాదస్తాలంటే చస్తే కిట్టవు. మా వసంతకు లక్ష సంబంధాలొచ్చాయి.

హేమా హేమీల్లాంటి పెళ్ళికొడుకులొచ్చారు. అవన్నీ తిరగ్గొట్టేశాను. ఎందుకనంటారు?' అని ఆగాడు బావ.

'చిత్తం! వింటున్నాను.' అన్నాడు అవతలి వ్యక్తి, ఏమంటే ఏం కొంపమీది కొస్తుందోనని.

'నా డబ్బు, మరో డబ్బుగల ఆసామీకి చేరడం నాకిష్టం లేదు. సామెత చెబుతారే, ఉన్నవాడూ ఉన్నవాడికే ఇచ్చి, లేనివాడూ ఉన్నవాడికే ఇస్తే, ఇక లేనివాళ్ళను చూసే దెవరట? అందుకనే, మా బావమరిదికిచ్చి చేశాను...ఒకప్పుడు మా మామగారు గొప్ప పొలిటీషియన్. ఉప్పు సత్యాగ్రహంలో ఆర్నెల్లపాటు జైల్లోకూడా ఉన్నాడు. అంతా దేశసేవలో ఖర్చు చేశాడు. వసంత నివ్వడానికి ఇది కూడా కారణం కాదు. వాడు పేదవాడు కాకపోతే వసంతను, ముకుందానికి చస్తే ఇచ్చేవాణ్ని కాదు. ఇప్పుడు వాడు కూడా నాదగ్గరే ఉంటున్నాడు ... ఇక నా సంగతేముంది లెండి. క్లబ్బుంది. నేనున్నాను ... ఏమంటారు?'

ఈ మాటలు విన్న తరువాత ముకుందానికి ఏడవాలో, నవ్వాలో కూడా తెలియలేదు. బావ ఇవన్నీ నిజంగా నమ్మే అంటున్నాడని లోకులు అనుకోవచ్చు. అలా అనుకోవాలనే ఆయనగారి తాపత్రయం కూడాను. కానీ అసలు విషయం తనకు తెలుసు. ఆ రాత్రి తను వసంతను తీసుకొచ్చినప్పుడు, తననూ, కూతుర్నూ కూడా చంపుతానని పిస్టల్ తీశాడు. రహస్యంగా తన కొంపలో చిచ్చుపెట్టానన్నాడు. ఎందులో నన్నా దూకి చావకుండా ఏ ముఖం పెట్టుకొని మళ్ళీ ఇంటి కొచ్చావని వసంతను నానా దుర్భాషలాడాడు. అడ్డం వచ్చిన అక్కయ్యమీద కూడా చెయ్యి చేసుకొన్నాడు. వారం

రోజులపాటు ఇంటిని నరకం కింద తయారు చేశాడు. ఇవన్నీ బావగారు ఇంతలోనే మరిచిపోతాడను కోవడం వెర్రితనం...

స్థాయీభేదం తప్పితే అక్కయ్య కూడా తనవంతు బాధ్యతను పూర్తి చేసింది. నీ స్థాయికీ, దానిస్థాయికీ సావాస మేమిటని అడిగేసింది. పొరబడితే సరిదిద్ద వలసిన వాడివి, నువ్వే పాడుపని చేశావని దుమ్మెత్తి పోసింది. వసంతను బడేగాం జమీందారుగా రబ్బాయికి ఇద్దామను కొన్నదట. ఆవిడ అయిదారుసార్లు క్లబ్బులో కలసినప్పుడు వసంతను చూసిందట. అప్పట్నించీ - వసంతను కోడల్ని చేసుకోవాలని ఫూరికే ఒకటే తొందర పడుతూ ఉందట. తనొచ్చి, ఆవిడ ఆదర్శాలన్నీ నాశనం చేశానంటుంది. వసంతకు సుఖపడేరాత లేదంటుంది! ఏడ్చింది!! మొత్తుకొంది!!!

కానీ అసలు విషయం అక్కకూడా అందంగా కమ్మే స్తోంది.

'కలిగిన సంబంధాలు బోలెడొచ్చాయిగానీ వదినా, నాకే ఇష్టంలేదనోయ్! అందుకని మా తమ్ముడికే ఇచ్చి చేశాను. అసలది పుట్టగానే వాడి పెళ్ళాం అని పేరు పెట్టు కొన్నాం! ఆపేక్షలంటూ ఉండాలేగాని వదినా ముష్టి డబ్బు దేమిటమ్మా! ఇప్పుడు మా ముకుందంగాడికేం తక్కువా? ఇదంతా వాడిది కాదూ? వాణ్ణి కాకుండా మే మాత్రం ఏం చేస్తాంగనక! నాకేం మొదణ్నించీ పుట్టింటి ఆశ ఉండనే ఉన్నదమ్మోయ్! వసంత కూడా ఒప్పుకుంది. సరే కానీ లెమ్మని మూడు ముళ్ళూ వేసేశాం... అమ్మాయి చదువు మానేసిందిగా......అయ్యో! నీకింకా చెప్పలేదా వదినా! వసంతకు ఆరో మాసం...'

చటుక్కున ఇవతలి కొచ్చాడు ముకుందం. అతని గుండెల్లో సన్నగా మంట ప్రారంభించింది. మంచంమీాద బోర్లా పడుకొని, దిండు గుండెల కింద పెట్టుకొన్నాడు. కింద నుండి ఇంకా అక్కయ్య మాటలు వినిపిస్తూనేఉన్నాయి....

'పొద్దోయింది. నువ్వెళ్ళి పడుకో తల్లీ !'

ముకుందం వూపిరి బిగపట్టినట్టు మూలిగాడు. కాస్సేపటికల్లా వసంత ఫ్లాస్కుతో గదిలో కొచ్చింది. తలుపుకు గడియ వేసింది. ఫాన్ స్విచ్చి నొక్కింది. కిటికీ కింది రెక్కలు వేసి, తెరలు సర్దింది.

'అలా ఉన్నావేం బావా ?' అన్నది వసంత.

ముకుందం పలక్కుండా ఉండిపోయాడు.

'నిద్రపోతున్నావా ?' అన్నది.

'లేదు.' అన్నాడు ముకుందం.

'కూర్చోరాదూ ?' అన్నది వసంత, తనూ అవతలి మంచంమీాద కూర్చుంటూ.

''ఇప్పుడు –' అని చివాలున మంచంమీాద కూచున్నాడు ముకుందం.

వసంత ముఖం వెలవెల పోయింది. కింది పెదవిని కొరుక్కొంది.

ముకుందం ఓక్షణం వసంతకేసి చూచి తల దించుకొన్నాడు.

వసంత లేచి ప్రక్క మంచంమీాద కూచుంది.

'ఏమిటో బావా ! ఏవో కావాలనుకొంటాం. మరేమిటో అయిపోతాం. అనుకొన్నదానికీ, అయినదానికీ – ఎక్కడా పొంతన ఉండదు. ఆ ఆశ వదులుకోనూ లేము.

ఉన్నదానితో సరిపెట్టుకోనూ లేము. బ్రతుకంతా ఈ సంఘర్షణతోనే సరిపోతోంది. ఎవరి బ్రతుకు వాళ్ళు బ్రతకడానికి లేదు. స్వతంత్ర జీవితం ఉన్నా, దాన్ని దాచి, పదిమంది కోసం మరో జీవితం జీవిస్తుంటాం. ఈ భాగం శుద్ధ నటన. ఇదెంత బాగా నటిస్తే అంత గొప్పవాళ్ళం. అంత మంచి వాళ్ళం. అవునా?' అన్నది వసంత,

'నాకు తెలీదు' అన్నాడు ముకుందం.

'నాకు తెలుసు. కాదు – తెలుసుననుకొంటున్నాను. ఈ నాలుగ్గోడల మధ్యా, మనం రంగ రంగ వైభోగంగా ఉంటున్నామని ఇంటిల్లపాదీ అనుకొంటున్నారు. పూటకి పదిసార్లు నీ గదిలో కొస్తుంటే అమ్మ ఎంత మురిసి పోతున్నదని. వచ్చిన ప్రతిసారీ నిన్నెంత బాధిస్తున్నానో నాకు తెలుసు.'

'నాకదేం లేదే!' అన్నాడు ముకుందం.

'అని నువ్వన్నా నేను నమ్మబోవడం లేదు. ఈ గదిలో ఆ మంచం మీద నువ్వూ, ఈ మంచంమీద నేనూ, హృదయాలు పెట్టే ఘోష వినలేక సతమతమై పోతున్నాం. నేను బాధపడటంలో న్యాయముంది. కానీ నీదే మరీ అన్యాయం. నీ మంచితనాన్ని స్వార్థంకోలదీ, అమానుషంగా ఉపయోగించుకొన్నా నేమో ననిపిస్తుంది అప్పుడప్పుడు. ఆ విషయం తట్టినపుడల్లా, నా పాపానికి నిష్కృతి లేదనిపిస్తుంది. నా బ్రతుకు ఎటుచూసీ బండలయి పోయింది. కనీసం నువ్వన్నా సుఖపడతా వనుకొంటే, అదీ లేకుండా నేను హరించేశాను.' అన్నది వసంత కన్నీళ్ళు తుడుచుకొంటూ.

'నేనలా అనుకొన్నప్పుడు నువ్వు బాధ పడాలి గానీ, కాదంటున్నాను గదా! నమ్మవా?' అన్నాడు ముకుందం.

'ఇప్పుడు నేను సుఖంగా లేనని నువ్వెందుకనుకొంటున్నావో నాకు తోచడం లేదు. చాలా మామూలుగా ముగిసి పోవలసిన జీవితం నాది. అలాంటిది ఓ గొప్ప ప్రయోజనానికి పనికి వచ్చిందంటే — అదొక్కటే చాలు నేను సంతోషించడానికి. ఆ భావం నాకిచ్చే ఆనందం — మరి దేనినుండీ పొందలేను.'

వసంత కాసేపు మౌనంగా ఉండిపోయింది.

'మన పెళ్ళయి రెండుమాసాలు అయిందనుకొంటాను.' అన్నది వసంత హఠాత్తుగా.

'కావచ్చు. ఏం?' అన్నాడు ముకుందం.

'మరేం లేదు. ఉత్తినే!' అంటూ వసంత మంచమీద పడుకొని, దుప్పటిని మెడదాకా కప్పుకొంది.

'దీపం ఉంచనా ఆర్పనా?' అన్నాడు ముకుందం.

వసంత ఫక్కున నవ్వింది.

'ఏమి' టన్నట్టు చూశాడు ముకుందం.

'ఆర్పేసెయ్యి. దీపం ఆర్పడం, కాస్సేపుండి మళ్ళీ వెలిగించడం, మనం ఈ గదిలో ఆడే నాటకంలో ఓ భాగం. కాబట్టి ఆ పనిచేసి తీరవలసిందే! ఓ సారి పొరబాటున ఆర్ప లేదు గావును ...అమ్మ బెల్లించి బెల్లించి అడిగింది.

'ఏమనీ?' అన్నాడు ముకుందం.

'మనం ప్రణయ కలహం గానీ పడ్డామా —' అని. లేదమ్మా అని చెప్పినా నమ్మదు. మగవాడు కాస్త కోపగించుకొన్నా, మనం సర్దుకు పోవాలంటూ ఆ రోజుల్లా చెబుతూనే ఉంది. నాకు నవ్వాలో, ఏడవాలో తెలిసింది కాదు. అందుకనే, ఆ మర్నాడు రాగానే, దీపంఆర్పి, మళ్ళా వెలిగించాను.' అన్నది వసంత.

ముకుందం కూడా నవ్వేశాడు.

'అయితే దీపం ఆర్పుతున్నాను.' అన్నాడు.

'కాస్సేపయాక వెలిగించడం మర్చిపోకు, బావా!'

ముకుందం నడుం వాల్చాడు. మసగ వెలుతురులో అటు తిరిగి పడుకొన్న వసంత మెడ పచ్చగా కనిపించింది. నిట్టూర్చాడు ముకుందం.

అతనిగ్గూడా ఈ నాటకం ఎబ్బెట్టుగా ఉంటోంది. పది మంది కోసం వసంతను ఏనాడో తను క్షమించాడు. ఇక మానసికంగా మన్నించడ మొక్కటే తనకు మిగిలింది. అనేక సార్లు వసంతను క్షమించాలను కొనేవాడు. క్షమించానని కూడా భావించేవాడు. ఇలా దూరదూరంగా తప్పుకు తిరగడం వల్ల ఆవిడ మనస్సెంత సంక్షోభ పడుతుందో ననుకొనేవాడు. ఈ రోజయినా మనసిచ్చి మాట్లాడాలనీ, ఆప్యాయంగా పలకరించాలనీ గట్టిగా అనుకొనేవాడు. కానీ, వసంత కనిపించగానే, పాత సంగతులన్నీ మనస్సులో జెర్రిపోతుల్లా బుసలు కొట్టేవి. ఆ విషవాయువులు తన సంకల్పాన్ని హరించి పారేసేవి. నిశ్శబ్దంగా ముసుగు పెట్టుకొని పడుకొనేవాడు.

నిజం చెప్పింది గనుక వసంతను తను క్షమించలేక పోతున్నాడు గానీ, అదే జరగకపోతే ఏమయిఉండేది? తను పూర్తిగా విశ్వసించేవాడు. హాయిగా ఉండేవాడు, వసంత తప్పు చెయ్యటం తప్పు కాదు. ఆ తప్పును ఒప్పుకోవటం తప్పు — అనిపిస్తుం దిప్పుడు. ఇటువంటి దోషమే తను చేసి ఉంటే, చేశానని వసంతకు తెలిస్తే, ఆమె తప్పకుండా తనను మన్నించి ఉండేది. తను చేసిన పొరపాటు, ఆమె ఆనందానికి, సుఖానికీ ఏ విధంగానూ అడ్డువచ్చేది కాదు. దాన్ని

మరిచిపోయి గానీ, లేదా నిర్లక్ష్యంచేసి గానీ, ఆమె సుఖపడేది. కానీ, అదేపని తను చెయ్యలేక పోతున్నాడు. బహుశా ఇది పురుషుల్లో ఉన్న ప్రత్యేకత కావచ్చు. వేశ్య పతివ్రత కాదని తెలిసి కూడా ఆమెతో సుఖించడానికి సిద్ధపడినవాడే, తన భార్య పొరపాటు చేసిందనో, చేసి ఉంటుందనో తెలిసి, ఆమెను ఏలడానికి నిరాకరిస్తున్నాడు.

వసంత అది కూడా కాదే! తెలియక చేసిన వో అపరాధాన్ని, చేసినట్టు ఒప్పుకొంది. అందుకోసం ఇంత శిక్షకు ఆమెను గురిచేయడం అన్యాయం. ముకుందం మెల్లగా మంచం మీది నుండి లేచాడు. లైటు వేశాడు. వసంత మంచం దగ్గరకొచ్చి నిలబడ్డాడు. లైటు కాంతి జాజ్వల్యంగా ఆమె వంటినిండా కురిసి, మెరిసి ఇంకిపోతోంది. తల్లో చామంతి పూలదండ పక్కకు జారింది. చెంపలమీది వెంట్రుకలు ఫానుగాలికి గిలగిల లాడిపోతున్నాయి. ఓ చెయ్యి తలకింద పెట్టుకొంది. మరో చెయ్యి పొట్టమీదుగా ప్రక్కకు వేళ్ళాడుతోంది. పొట్ట ఎత్తుగా కనపడుతోంది. దుప్పటి కూడా దాని ఔన్నత్యాన్ని దాచలేకపోతోంది.

ముకుందం అలానే నిలబడి ఉన్నాడు. చటుక్కున మూర్తి బొమ్మ కనిపించింది. మూర్తి, వసంతా చెట్టపట్టా లేసుకొని తిరుగుతున్నట్టూ, ఇద్దరూ, గదిలో ఒంటరిగా గడిపినట్టూ, వసంత చేతులు అతన్ని పెనవేసుకోవడం, మూర్తి ఆమె చెక్కిళ్ళను చుంబించటం, చిరునవ్వులు, గుసగుసలు, మసక చీకటి, చిరుచెమట, చిన్నమూలుగు .... వరుసగా స్ఫురించాయి. మనస్సంతా కకావికలయి పోయింది. ఛటుక్కున దీపమార్పి, మంచం మీద పడుకొన్నాడు.

* * * *

ఇల్లంతా హడావుడిగా ఉంది. డాక్టర్ల కోసం కార్లు పరుగెత్తాయి. బావగారు కాలుగాలిన పిల్లిలాగా, వరండాలో అటూ ఇటూ తిరుగుతున్నాడు. అక్కయ్య అందర్నీ కసురుకొంటూ పెద్దగా కేకలేస్తోంది. పనివాళ్ళు బిలబిలలాడుతున్నారు. ఇరుగు పొరుగు అక్కదేవతలు చాలామంది చేరుకొంటున్నారు.

వసంత బాధగా మూలుగుతోంది. చుట్టూ ఉన్నవాళ్లు 'ఓర్చుకోవాలమ్మా' అంటున్నారు. 'నెత్తిమీది బరువా తల్లి మరొకరు దించడానికి'—అన్నదొకావిడ. 'తొలికాన్పుగదా, నరుసమ్మను పిలిపించక పోయారుటమ్మా!' అన్నారింకొకరు.

అరగంట సేపుదాకా ఇల్లంతా ఈ గొడవతోనే నిండిపోయింది.

'గుడ్ లక్! మగపిల్లవాడమ్మా!' అన్నది డాక్టరమ్మ.

పనిమనిషి గబగబా మేడమీదికొచ్చి, ముకుందంగారి గది తలుపులు నెట్టింది.

ముకుందం రక్తపు మడుగులో వెల్లకితలా నిర్జీవంగా పడి ఉన్నాడు.